క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో 16 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయనుండడంతో గురువారం నగరంలో తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, గజ్జల ఆనంద్‌రావు, సుద్దాల లక్ష్మణ్, లడ్డు మీసాల, సాయులు, కొండ్ర స్వరూప, మనలా నారాయణ, మేడ్కా కుమార్, మారంపెల్లి నర్సయ్య, గడ్డం నాగరాజు, కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో గురువారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వశక్తి సంఘాల మహిళలకు పోషకాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ సజ్జలు, రాగులు, కొర్రలు తదితర మిల్లెట్‌ఫుడ్‌తో మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషకాహారంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీవో మమత, అంగన్‌వాడీ టీచర్లు గీత, మణెమ్మతో పాటు స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రిలో కిడ్నీ డే

కరీంనగర్‌టౌన్: వరల్డ్ కిడ్నీ డే పురస్కరించుకొని అపోలో రీచ్ హాస్పిటల్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, ప్రారంభ దశలోనే కిడ్నీ వ్యాధులను గుర్తించి సరైన వైద్యం అందించడం, తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారిన పడిన రోగులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొత్త చాందిని, డాక్టర్ ఎస్.సురేశ్‌గౌడ్, ఎస్.నాగసతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురువేస్తున్న మహిళలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ 1980లో మోటురి ఉదయం ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా సంఘంగా ఏర్పడి 1981 ఆంధ్ర మహాసభ ఏర్పాటు చేసుకొని దేశవ్యాప్తంగా ఒకటే పేరు ఉండాలని ఉద్దేశించి అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘంగా ఏర్పడిందన్నారు. మహిళ హక్కుల సాధన కోసం పోరాడుతుందని తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం సీట్లు రిజర్వేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు దేవ అన్నపూర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి జరీనా బేగం, జిల్లా కమిటీ సభ్యురాలు స్వరూప, లక్ష్మీ, రజిత, శారద, రోజా, యమునా, రమ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

మానకొండూర్: కరీంనగర్ కదనభేరి సభలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. గురువారం మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తాలో రసమయి చిత్రపటానికి చీర, సారె బహూకరించి నిరసన తెలిపారు. బండి సంజయ్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని మండల అధ్యక్షుడు ప్రవీణ్ హెచ్చరించారు. నాయకులు ప్రభాకర్, రాజిరెడ్డి, ప్రదీప్, రవీందర్, దేవేందర్‌రెడ్డి, మహేశ్, రమేశ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌లో ఇద్దరు అధికారుల బదిలీలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో ఏఆర్ విభాగంలో ఇరువురు అధికారులు బదిలీ అయినట్లు తెలిసింది. కరీంనగర్ ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌ను రామగుండంకు బదిలీ చేయగా.. కొంత కాలంగా ఖాళీ ఉన్న ఏఆర్ అడిషనల్ డీసీపీగా అనోక్ జైన్‌ను నియమించినట్లు సమాచారం.

మంచి మార్కులు సాధిస్తాం

- సమయం వృథా చేయం.. భవిష్యత్‌పై దృష్టిపెడతాం
- ఇంటర్ పరీక్షలు ముగిశాక కేంద్రాల వద్ద విద్యార్థుల ఆనందం



పరీక్షలు బాగా రాశాం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఏడాది పాటు చదివిన చదువు.. పరీక్షలు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూసిన ఇంటర్ విద్యార్థులు.. తీరా పరీక్షలు ముగిశాక ఎగిరి గంతులేశారు. గురువారంతో ఇంటర్ పరీక్షలు ముగియడంతో ఆయా సెంటర్ల ఎదుట విద్యార్థుల హడావుడి, హంగామా చెప్పనక్కర్లేదు. విద్యార్థులు ఆయా సెంటర్ల ముందు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరి గంతేశారు. జీవితంలో ఇంతకు మించిన ఆనందం ఇంకేం ఉండదన్నట్టు చిందులేశారు. గదిలో తమతో పాటు పరీక్షలు రాసిన వారిని పలకరించారు. బై బై చెప్పుకున్నారు. ఎక్కడో ఒక దగ్గర తప్పకుండా కలుద్దామంటూ సంకేతాలిచ్చుకున్నారు. ఫోన్ నంబర్లు తీసుకున్నారు. ఇలా 2023–24 సంవత్సరపు ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిశాయి. పరీక్షల్లో స్టేట్ ర్యాంక్‌లు ఇక మావే అంటూ పలువురు విద్యార్థుల కేరింతలు.. కొన్ని రోజులు స్టడీస్‌కు సెలవులు ఇద్దామనుకున్న వారు కొందరు.. హాలీడేస్‌లో నేర్చుకోవాలనుకున్న వాటన్నంటిని నేర్చుకోవడమే అని ఇంకొందరు... ఎంసెట్, నీట్ కోచింగ్ తీసుకుంటామంటున్నారు మరికొందరు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను 'సాక్షి' పలకరించగా వారు పరీక్షలు రాసిన తీరు, చేయబోయే భవిష్యత్ ప్రణాళిక, ఎంచుకొన్న లక్ష్యాలను వారి మనోభావాల్లో వెల్లడించారు.



పరీక్షలు బాగా రాశా



ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బాగా రాశా. హ్యాపీగా ఉంది. స్టేట్ ర్యాంక్ వచ్చేలా మార్కులు వస్తాయి. ఇక సెకండ్ ఇయర్ పైనే నా దృష్టి. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతా. ఎంసెట్‌లో కూడా స్టేట్ లెవల్ ర్యాంక్ కొట్టాలనేది నా ఆశయం.

– హాసిని రెడ్డి

నీట్ కోచింగ్ తీసుకుంటా..



పరీక్షలు ముగిసినందుకు హ్యాపీగా ఉంది. చాలా బాగా రాశా. ఫస్టియర్‌లో 432 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం స్టేట్ ర్యాంక్ మార్కులు వస్తాయి. ఇక ఈ హాలిడేస్‌లో నీట్ కోచింగ్ తీసుకోవాలనుకుంటున్న. డాక్టర్ కావాలనేది నా ఆశయం. సమాజానికి సేవ చేయాలనేది నా లక్ష్యం.

– మేఘన

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది ఆశయం



ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు బాగా రాశా. స్టేట్ ర్యాంక్ ఖచ్చితంగా వస్తుంది. ఫస్ట్ ఇయర్‌లో 465 మార్కులు వచ్చాయి. పేపర్‌లో ఉన్న ప్రశ్నల కంటే ఎక్స్‌ట్రా ప్రశ్నలు రాశా. పరీక్షలు ఎలా రాస్తామో అన్న టెన్షన్ ఉండేది. ఇప్పుడు హ్యాపీగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది నా ఆశయం.

– శివసాయి

ఎంసెట్ కోచింగ్ తీసుకుంటా..



ఇంటర్ పరీక్షలు ముగిశాయి. అందరం చాలా బాగా రాశాం. మంచి మార్కులు కూడా వస్తాయి. ఇక మా ముందున్న లక్ష్యం ఎంసెట్. మంచి ర్యాంక్ సాధించాలని లక్ష్యం పెటుకున్నా. ఇక ఎంసెట్ కోచింగ్ తీసుకుంటా. ఇంజినీర్ కావాలనేది నా గోల్.

– జి.నితీష్

మంచి మార్కులు వస్తాయి



ఇంటర్ పరీక్షలు అనగానే మాలో టెన్షన్ ఉండేది. కాని ఫస్ట్ ఎగ్జామ్ కాగానే టెన్షన్ పోయింది. ఇక పరీక్షలన్నీ చాలా హ్యాపీగా జరిగాయి. పేపర్‌లు చాలా ఈజీగా వచ్చాయి. మంచి మార్కులు వస్తాయి. ఈ హాలీడేస్‌లో టైం వేస్ట్ చేయకుండా సెకండ్ ఇయర్ ప్రిపరేషన్ మొదలుపెడుతా.

– ఇష్టా రెడ్డి

కారల్‌మార్క్స్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కారల్‌మార్క్స్ వర్ధంతిని గురువారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి మాట్లాడుతూ మానవజాతి చరిత్రను మలుపుతిప్పిన మహోన్నత మానవుడు కారల్‌మార్క్స్ అన్నారు. 1846లో జర్మన్ భావజాలం గ్రంథం ద్వారా నూతన సిద్ధాంతమైన గతితార్కి భౌతికవాద సూత్రాలను ప్రతిపాదించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యూ.శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, నాయకులు నాగమణి, తిరుపతి, రవి, శ్రీకాంత్, వినయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీవోలో ఇద్దరికి పదోన్నతి

కరీంనగర్ అర్బన్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పలువురికి పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ సీఈవో అనితారామచంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి పదోన్నతి కల్పించగా ఆయా విభాగాలను కేటాయించారు. కరీంనగర్ డీఆర్డీవోలో సూపరింటెండెంట్ పి.శ్రీదేవికి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(అకౌంట్స్)గా పదోన్నతి రాగా ఇక్కడే డీఆర్డీఏకు కేటాయించారు. జగిత్యాల డీఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ ఎస్‌వోగా పనిచేస్తున్న ఎంద్ర బాలయ్యకు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(అకౌంట్స్) పదోన్నతి రాగా అక్కడే ఎంఅండ్ఈ కేటాయించారు.

రూ.3 కోట్లతో వ్యవసాయ కళాశాల

- నేడు భవన నిర్మాణ పనులకు మంత్రి ప్రభాకర్ శంకుస్థాపన
- శిలాఫలకంలో ప్రొటోకాల్ వివాదం
- ఎమ్మెల్యే కమలాకర్‌స్థానంపై బీఆర్‌ఎస్ అభ్యంతరం



ఏఈ మగ్బుల్‌తో మాట్లాడుతున్న ఈఈ అనిత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు గురువారం టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత, డీఈ నాగేశ్వరచారి, ఏఈ సయ్యద్ మగ్బుల్ తదితరులు కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. భూమిపూజ చేసే స్థలాన్ని చదును చేసి శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే అంతకు ముందుగా శిలాఫలకంలో ముఖ్యఅతిథుల జాబితాలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేరు తొమ్మిదో స్థానంలో ఉండటంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే పేరు ముందువరుసలో ఉండాలని డిమాండ్ చేయడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు చివరకు సభాధ్యక్షుడి స్థానంలో చేర్చడంతో వివాదం సద్దుమణిగింది.

మొదటి విడతలో రూ.3కోట్లు మంజూరు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గతేడాది కొత్త కోర్సులతో 15 వ్యవసాయ డిగ్రీ కళాశాలలను ప్రారంభించింది. జిల్లాకు మంజూరైన కళాశాలకు అవసరమైన స్థలాన్ని మొగ్దుంపూర్ పూరేన్‌గుట్ట వద్ద 43.16 ఎకరాలు కేటాయించారు. కళాశాల భవన నిర్మాణానికి రూ.23 కోట్లతో ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అనంతరం అక్టోబర్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.30 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల ప్రహరీని నిర్మించారు. ఆర్నెళ్లక్రితం మొదటి విడతగా కళాశాల భవన నిర్మాణానికి రూ. 3కోట్లు మంజూరు చేయగా ఇటీవల టెండర్‌పనులు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 9గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

కార్పొరేషన్‌ల ఏర్పాటుపై సంబరాలు



ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం వివిధ కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడంపై ఆయా కుల సంఘాలు సంబరాలు నిర్వహిస్తున్నాయి. మాల మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్టీలకు మూడు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినందుకు నగరంలోని ఇందిరాచౌక్ వద్ద సీఎం, మంత్రి పొన్నంల చిత్రపటాలకు కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఇందిరాచౌక్ వద్ద సంబరాలు జరిపారు. రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి, సీఎం, మంత్రి పొన్నంలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్‌నాయక్, పులి ఆంజనేయులుగౌడ్, వెన్న రాజమల్లయ్య,కంకణాల అనిల్‌కుమార్, ముక్క భాస్కర్, తాటిపల్లిబుగోపాల్, భూపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16న సాగునీటి కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా



మొగ్దుంపూర్‌లో ఎండిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

కరీంనగర్‌రూరల్: ఎస్సారెస్పీ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో సాగునీరందక ఎండిన వరిపొలాలను బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఎస్సారెస్పీలో నీళ్లున్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సాగునీరందక జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పంటలన్నీ ఎండిపోయినట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, నాయకులు చిందం శ్రీనివాస్, తిరుపతి, నరేందర్, రమేశ్, శివరామకృష్ణ, సత్యం, శంకరయ్య, నారాయణ, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై అనభేరి విగ్రహం ఏర్పాటు చేయాలి



అనభేరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎల్లాపి సంఘం నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ఎల్లాపి సంఘం డిమాండ్ చేసింది. అనభేరి వర్ధంతి సందర్భంగా గురువారం ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో నగరంలోని అనభేరి విగ్రహానికి పూలమాలలు వేసి సంఘ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనభేరి చరిత్రను ప్రస్తుత, భావితరాలకు తెలియజేసేందుకు ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అనభేరి జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనభేరి ప్రభాకర్‌రావు కూతురు విప్లవకుమారి, ఎల్లాపి సంఘం అర్బన్ యూనిట్ అధ్యక్షుడు పెంచాల మురహరిరావు, ప్రధాన కార్యదర్శి లక్కాకుల సురేందర్‌రావు, రూరల్ యూనిట్ అధ్యక్షుడు పెంచాల కిషన్‌రావు, అనభేరి యుగంధర్‌రావు, తూం పృథ్వీధర్‌రావు, నారదాసు వసంత రావు, ఆవుదరి వేంకటేశ్వర రావు, వేల్పుల సదాశివ రావు, తులా మధుసూదన్ రావు, సాయిని జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై దృష్టిసారించాలి

కరీంనగర్‌టౌన్: నగరంలోని గీతాభవన్ చౌరస్తా నుంచి బస్టాండ్ వైపు వెళ్లే రహదారిపై ఇటీవల వెలిసిన దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని బీజేపీ నాయకుడు ఇటిక్యాల అనీశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్యలతో కార్పొరేషన్ అధికారులు, పోలీసులు రోడ్డుపై దుకాణాలకు అనుమతులు ఇవ్వలేదని అన్నారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం మళ్లీ దుకాణాలకు అనుమతులు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులను తరిమేస్తున్న కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రహదారిపై నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టకపోవడం విచారకరమన్నారు. ట్రాఫిక్ సమస్యలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు రాబోయే రోజుల్లో చిరు వ్యాపారాలు చేసుకునే వారిని కూడా ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

కొత్తపల్లి మండలానికి రూ.7.35 లక్షల ఎంపీ నిధులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన ఎంపీ నిధుల నుంచి రూ.7.35 లక్షలు కేటాయించారని బీజేపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.రతన్‌కుమార్, అనిల్ కుమార్, అంజనీకుమార్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కమాన్‌పూర్‌లోని వడ్డెర కుల సంఘ భవన నిర్మాణానికి రూ.3 లక్షలు, చింతకుంటలో రజక సంఘం భవన నిర్మాణంకు రూ.3లక్షలు, అదేవిధంగా నాగులమల్యాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం రూ.1.35 లక్షల నిధులు కేటాయించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

17న నేత్ర వైద్యశిబిరం

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 17న ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ పాషా, కార్యదర్శి విష్ణుదాస్ గోపాలరావు, ప్రచార కార్యదర్శి గంజి జయవర్ధన్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేడివిజన్ కంటి ఆసుపత్రి వైద్యులు హుజూరాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టు కుటుంబాలకు పరీక్షలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సకు పంపించనున్నట్లు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్: మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపారు. 30 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్న చిగురుమామిడి మండలం కొండాపూర్, ర్యాకలదేవపల్లికి చెందిన వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీందర్ సింగ్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలకసంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వీధి దీపాల విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, జీవో3 ప్రకారం వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ ఎలక్ట్రికల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అసోసియేషన్ కోరింది. ఈమేరకు గురువారం నగర మాజీ మేయర్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సర్దార్ రవీందర్ సింగ్, అధ్యక్షుడు రాచకొండ నాగరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. 30 ఏళ్లుగా తాము వీధి దీపాల విభాగంలో పనిచేస్తున్నామని తెలిపారు. తమకు జీవో నం.2501 ప్రకారం రూ.15,600 మాత్రమే చెల్లిస్తున్నారని, కాని మున్సిపల్ జీవోఎంఎస్ 3 ప్రకారం రూ.19,600 ఇవ్వాలన్నారు. అలాగే ఇప్పటివరకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11కేవీ జ్యోతినగర్ ఫీడర్ పరిధిలోని జ్యోతినగర్ మోర్ సూపర్ మార్కెట్ వెనుక ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలరించిన వీడ్కోలు వేడుక



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక అలరించింది. విద్యార్థులు తమ జ్ఞాపకాలను కాసేపు నెమరేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు నజీర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మంచిపౌరులుగా ఎదగాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకరావాలని సూచించారు. విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, లక్ష్మణమూర్తి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీపతి, వెంకట నర్సయ్య, రవీందర్ రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, మంజుల, శ్రీలత, పద్మ, లక్ష్మి, రాజమణి, విజయలక్ష్మి, నవ్య తేజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: దాద్రనగర్ హవెలిలో ఈనెల 16 నుంచి 20 వరకు జరుగనున్న జాతీయస్థాయి సీనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారిణిలు ఎంపికైనట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సంపూర్ణ, పూజిత, యోగేశ్వరిలు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారిణులను డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణ రావు, నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ వేల్పుల సురేందర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.